# స్మృతి

కాలేజీగంట కొట్టి అప్పుడే అయిదు నిమిషాలైంది. క్లాసంతా నిశ్శబ్దంగా ఉంది. ముక్కుమీద కళ్లజోడు సరిచేసుకొంటూ చేతిలో పుస్తకం తెరవబోయాడు ప్రొఫెసర్. అకస్మాత్తుగా, అతని దృష్టి ఎదటి బెంచిమీదకి పోయింది. ఎదురుగా ఒక అమ్మాయి క్లాసులో నిలబడి ఉంది. తెల్లచీర కట్టుకుంది. సన్నగా లేతతమలపాకులాఉంది. ప్రొఫెసర్ కేసి బెదరుచూపులు చూసింది. సుమారు పద్దెనిమిది ఏండ్ల క్రితం అదే రూపంలో ఓ పిల్ల మందహాసంతో తన కేసి చూస్తూ ఉండేది. కాని, అది అంతా స్వప్నం; ఎప్పుడో కరగి చెదరిపోయిన ఘట్టం. స్వర్గలోకంనుంచి దేవతలు దిగివస్తారా!

'నాపేరు పిలువలేదు'— అంటూ, కోకిల పలికినట్లు ఆ పిల్ల అటెండెన్సు జ్ఞాపకంచేస్తూ అన్నది. క్లాసంతా సన్నగా ముసిముసి నవ్వులు నవ్వుతోంది.

'కొత్తగా చేరావా?' అని, పరధ్యానంలోంచి బయటికొస్తూ ప్రొఫెసర్ అడిగాడు.

ఆయన క్లాసులో ఆడపిల్లలు చేరటం అదే మొదటిసారి. ఆ ఉన్న మొగపిల్లలమీద ఆయనకు శ్రద్ధలేదు. కోతివెధవలకు ఏంచెప్పినా ఒక్కటే! కొందరికి నిద్రవొస్తే, కొందరికి అంతులేకుండా కబుర్లువస్తాయి. ఎవరికైనా, శ్రద్ధ ఉంటే, వాళ్లకి పాఠంచెప్పకపోయినా ఫరవాలేదు. వాళ్లు స్వంతంగా చదువుకోగలరు. అందుకే, ఆయన క్లాసుమీద

ఎక్కువ దృష్టి ఉంచడు. ఆయన గొడవలో ఆయన ఉంటాడు. అందుకే అవ్వాళ ఆపిల్ల క్లాసులో ఉన్నదే ఆయన గమనించలేదు.

ఆపిల్ల ఆయన ప్రశ్నకి సమాధానంగా తల ఊపింది.

'నీపేరు ?' అని మళ్లా అడిగాడు ప్రొఫెసర్.

'సుహాసిని' అన్నది ఆ అమ్మాయి అవ్యక్త మధుర కంఠంతో. ప్రొఫెసర్ పేరు వ్రాసుకొని పాఠం ప్రారంభించాడు:

'అశోకుడు కళింగయుద్ధానంతరం విరక్తిజెంది' అశోకుడికి ఆసమయంలోకలిగిన విరక్తినిగురించి ఉపన్యసించడంలో ప్రొఫెసర్‌కు అంతులేని విరక్తి పుట్టుకొచ్చింది. పాఠంమీద మనస్సు లగ్నంకాలేదు. మాటిమాటికి చూపులు తనకి తెలీకుండానే, ఆ పిల్లవైపుకి వెళ్లుతూ ఉండడం చికాకు కలిగించింది. చూడగా చూడగా, శాంతకీ, ఆ పిల్లకీ ఉన్న పోలికచూస్తే కాళ్లు వణకి, గుండెలు కొట్టుకోసాగినవి. పద్దెనిమిది ఏళ్ళ తేడాలేకపోతే, జరిగిన కథ ఆవిధంగా జరిగి ఉండకపోతే, నిజంగా శాంతే వచ్చింది అనుకునేవాడు.

అంతలోనే ఆప్రక్క బెంచిలోనే కూర్చున్న నాగేశం, తన చూపులకి విపరీతార్థం కల్పించుకొని వ్యంగ్యంగా నవ్వడం చూస్తే ప్రొఫెసర్‌కు అసహ్యంవేసింది. పుస్తకం మూసి, 'ఇవ్వాళిటికి చాలు!' అంటూ బయటికి నడిచాడు.

ప్రొఫెసర్‌ది ఏవూరో అక్కడెవరికీ సరిగా తెలియదు. పదిహేను ఏళ్ల క్రిందట మలబారుప్రాంతమునుంచి అతను అక్కడకు వచ్చిచేరాడు. అప్పటికి అతనికి పాతికేళ్లు.

భయంగా, కొంచం విరక్తిగా ఉండేవాడు. అటు తరువాత ఆ కాలేజీలో, అక్కడే పాతుకుపోయ్యాడు. ఎప్పుడూ ఆయన తిరిగి స్వదేశం వెళ్లినట్లు కనిపించదు. ఆయన జీవితం నిర్మలంగా, ఒడిదుడుకులు లేని ప్రవాహంలాగ గడచి పోయింది. ఆ కాలేజీలో ఆయనకి పదిహేను ఏళ్ల సర్వీసు అయింది. అంతే, ఆయన తననిగురించి చెప్పుకోవాలంటే విశేషం ఏమీ లేదు. ప్రపంచాన్ని కల్లోలపరచే సమస్యలేవీ అతను పరిష్కరించలేదు. ఆయన జీవితంలో ఎప్పుడూ ఓ చిన్న గాలిదుమారమైనా చెలరేగినట్లులేదు. ఆ కాలేజీకి సంబంధించిన వాళ్ళందరికీ ఆయన ప్రొఫెసర్, అంతే. అంత కన్న ఆయనను గురించి యెవరికీ యేమీ తెలియదు. కొందరు మాత్రం, ఆయనను తక్కిన ప్రొఫెసర్లతో వేరుపరచడానికి 'కళ్ళజోడు ప్రొఫెసర్' అని ప్రత్యేకించి చెప్పేవారు. అంటే, కళ్ళజోడు ఇంకెవరికీ లేదనికాదు. ఎందుకో, ఆ పేరు ఆయనకి అతుక్కుపోయింది.

ప్రొఫెసర్ ఇంట్లో తానూ, నౌకరివాడు తప్ప ఇంకెవరూ లేరు. ఆయన ఇల్లు శుభ్రంగా పెట్టుకునేవాడు. చక్కగా బల్లమీద ఫ్లవర్‌వాస్, ఓపక్క పుస్తకాలు, మరోప్రక్క సోఫాలు. అక్కడక్కడ గోడలమీద మంచిమంచి బొమ్మలు, అన్నీ తీర్చినట్లు ఉండేవి. కాలేజి లేనిసమయంలో ప్రొఫెసర్ తరుచు ఇంట్లోనే ఉండేవాడు. ఎప్పుడూ ఏదో చదువుతూ ఉండేవాడు. ఆయనకి ఎక్కువమంది స్నేహితులు లేరు. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడం ఆయనకి అలవాటులేదు. పొద్దున సాయంత్రం ఒంటరిగానే ఏదో పుస్తకం చేతబట్టుకొని

ఎంతోదూరం ఒక్కడే నడచి వస్తుండేవాడు. క్రమం తప్పకుండా ప్రతి వేసంగికి ఏదో చల్లని ప్రదేశానికి వెళ్లివస్తుండేవాడు. అంతే, ఆయన జీవితక్రమం. క్రమక్రమంగా రోజులు ఒకదాని నొకటి తోసుకొని ముందుకువచ్చి జరిగిపోతున్నాయి. గమ్యస్థానం ఎక్కడో! ఎప్పుడో! అక్కడ మిగిలేదేమిటో !!

అందరికీ ఆయనను చూస్తే గౌరవమే. ఆయనిదేదో వింత ప్రకృతి అనుకొనేవారు. మళ్లీ, ఆదరణ చూపేవారు. కాని, ప్రొఫెసర్‌కి మాత్రం ఎవరిమీదా, ఎప్పుడూ, దృష్టి లగ్నమయ్యేది కాదు. ఎవరి గొడవా మనసుకు నాటేదికాదు. ఎవరిమీదా మమకారం నిలిచేదికాదు.

కాని, సుహాసిని క్లాసులో చేరాక ఆయనలో ఏదో కొంత మార్పువచ్చింది. క్లాసులో ఆయన దృష్టి మాటిమాటికీ ఆ పిల్లవైపుకే వెళ్ళడం, ఒకొక్కసారి అక్కడే స్థిరపడిపోయి ఆమె కోసమే పాఠం చెబుతున్నట్లుగా ప్రవర్తించడం...పిల్లలు గమనించారు. గంట అయినా క్లాసు వదలకపోవడం, విద్యార్థులు తమలో తాము ముసిముసి నవ్వులు నవ్వుకునేవారు. అందరిలోకి నాగేశం ఎక్కువ అల్లరిచేసేవాడు. వృద్ధాప్యంలో ప్రొఫెసర్‌గారికి బాణాలు తగులుతున్నాయని వ్యంగ్య వాక్యాలు పలికేవాడు.

ప్రొఫెసర్‌కి ఈ గొడవేమీ తెలియదు. ఏదో ఎన్నడో పారవేసుకున్న వస్తువుకేసి చూసినట్లు తాను పదేపదే ఆ పిల్లకేసి ఎందుకు చూస్తున్నాడో కూడా ఆయనికి అర్థం కాలేదు. ఎక్కడో ఎన్నడో అణగి నిద్రపోతూన్న స్వప్న

లను ఆమె తీవ్రంగా కదిపిలేపింది. నిద్రాణువైన ఆయన జీవితంలో చైతన్య స్రవంతి ప్రవహించింది. చైతన్య రహితమైన ఆయన జీవితంలో ఏదో ఆశ రేకెత్తింది.

కాలేజీలో చేరిన పదిరోజులకి ఓనాడు సాయంత్రం సుహాసిని ఆయన గుమ్మంముందు ప్రత్యక్షమైంది. చేతిలో ఏదో నోటు బుక్కుతో, బెదరు చూపులు చూస్తూ నుంచుంది. సావకాశంగా పేపరు చదువుకుంటూన్న ప్రొఫెసర్ కంగారు పడి చూచాడు. తెలివి తెచ్చుకొని, లోపలికి ఆహ్వానించాడు. కుర్చీలో కూర్చుంటూ సుహాసిని ప్రారంభించింది. తాను ఆలస్యంగా చేరడంచేత తన కేమీ బోధపడడం లేదనీ, ప్రొఫెసర్ ఆయనకి తీరిక ఉన్నప్పుడు సహాయంచెయ్యాలనీ కోరింది. ప్రొఫెసర్‌కీ కాదనడానికి నోరురాలేదు, ఏదో ప్రశ్నలు వేస్తూ గడచిన పాఠాన్ని కొద్దిగా చెప్పాడు. మాటల సందర్భంలో సుహాసిని తనకెవరూ లేరనీ, ఇక్కడ హాస్టల్‌లోనే ఉంటున్నానని చెప్పింది.

ఆరోజునుంచి సుహాసిని ప్రొఫెసర్ ఇంటికి రావడం పరిపాటి అయిపోయింది. సాయంత్రం ఆరు అయ్యేసరికల్లా ప్రొఫెసర్ కుతూహలంతో ఆమెకోసరం ఎదురుచూస్తుండే వారు. అతనికి జీవితంలో ఏదో కొత్త ఉత్సాహం దొరికి నట్లయింది. నిరామయంగా గడచే జీవితం ఆశామయమైంది. అనంతంగా, అడ్డులేకుండా గడిచే కాలం ఏదో ఒక నిమిషం కోసం, ఒక ఘడియకోసం ఎదురుచూడటంతో పరిమితమైనది.

శాంత పోలిక ప్రస్ఫుటంగా ఉంటడమే సుహాసిని తనను ఆకర్షించడానికి ముఖ్య కారణమైనా, ఆమెతో

పరిచయం ఎక్కువైనకొద్దీ, ఆమె తెలివితేటలు, మంచితనం, సహానుభూతి అతణ్ణి ముగ్ధుణ్ణి చేశాయి. పాఠాల సందర్భంలోనే ఎన్నో విషయాలు ఆమెతో అతను మాట్లాడుతూ ఉండేవాడు. ఆ పిల్ల వివేకం, సద్గుణములు హృదయానికి హత్తుకుపోతుండేవి. క్రమక్రమంగా సుహాసిని అతనికి ఆత్మబంధువుగా తోచింది. ఆమె మంచి చెడ్డలన్నీ తనమీదనే ఆధారపడియున్నట్లుగా భావించుకొనేవాడు.

కాని, సుహాసిని ప్రొఫెసర్ ఇంటికి అంత తరుచుగా రావడం మాత్రం ప్రపంచం ఒప్పుకోలేదు. సమ వయస్కులైనా, కాకపోయినా, స్త్రీ పురుషుల మధ్య ఒక్కరకమైన సంబంధాన్నే ప్రపంచం ఊహించుకోగలదు. ఆదరణ, సహానుభూతి, పరస్పర గౌరవం ఇవికూడా స్నేహకారణాలని పాటించదు.

లోకం తన పేరూ ప్రొఫెసర్ పేరూ కలిసి చెప్పడం సాగించేసరికి తప్పనిసరిగా ఆమె అతనికి దూరదూరంగా జరిగిపోయింది. క్లాసులోకూడా అతనికి కనబడకుండా ఏమూలనో కూర్చొని లేచిపోతుండేది. కాని, లౌకికవిషయాలు ప్రత్యక్షంగా చెప్పినా తెలుసుకోలేని ప్రొఫెసర్‌కు ఆమె నడత అర్థంకాలేదు. ఆమెకోసం ఎదురు చూడటానికి అలవాటు పడిన అతనికి ఆమె రాకపోవడం ఏదో గొప్ప వెలితిగా కనిపించింది. ఆమెకు ఎవరూ లేరు. తనకీ ఎవరూ లేరు. తను ఆమెకి అండగా ఉండవచ్చుననుకున్నాడు.

నాలుగురోజులు చూసి తానే ఆమెకు కబురుచేశాడు. ఆమె వచ్చి కుర్చీ నానుకు నించున్నది. ప్రొఫెసర్ ఆవేగంతో

అడిగాడు: 'ఇన్నాళ్ళూ రాలేదేమి ?'

సుహాసిని చెమ్మగిలిన కళ్ళతో క్రిందికి చూస్తూ 'మీరు నాకు సహాయం చేయడం ఎవరికీ ఇష్టంలేదు. ఆ బాధ భరించ లేకుండా ఉన్నాను. ముఖ్యంగా, నాగేశం–' మాట పూర్తి చేయలేక కళ్లు తుడుచుకుంది.

ప్రొఫెసర్ కి ఏమీ అంతుబట్టలేదు. 'ఏం చేశాడు... నాగేశం ?' అని ఆదుర్దాగా అడిగాడు.

సుహాసిని తన్ను తాను ఓదార్చుకుని మెల్లగా అన్నది. 'ఏమీ లేదు. ఎందుకో ఎప్పుడూ, నా వెనకాలే తిరుగుతూ ఉంటాడు. మీ పేరు చెప్పి ఏదో వెక్కిరిస్తాడు.'

అప్పటికి అర్థమైంది ప్రొఫెసర్ కి. కొంచెంసేపు ఊరుకొని, ఏమీ జరగనట్లే ఆ ప్రసక్తి విడిచిపెట్టి మాట్లాడాడు.

'మీ దేవూరన్నావు ?' అని అడిగాడు, ఇదివరకు ఎప్పుడో ఒక సారి అడిగిన సంగతి మరచిపోయి.

'స్వర్ణపురం' అన్నది, సుహాసిని.

ఆ పేరు ఎక్కడో విన్నట్లనిపించింది. చిరపరిచితమైనదే. తన ఊరికి దగ్గరే. కొంచెంసేపు ఆలోచింపగా, చటుక్కున స్ఫురించింది. అన్నట్లు, శాంతను ఆ ఊళ్లోనే ఎవరికో ఇచ్చారు.

అతనికి, గడచినగాథ పొగమంచు తెర వెనకరంగంలో జ్ఞప్తికి వచ్చింది.

అవి అతను కొత్తగా పరీక్ష ప్యాసయి డిగ్రీ సంపాదించుకొన్న రోజులు. తన పల్లెలో తనే మొదటి పట్టభద్రుడు. అన్నగారు వ్యాపారంలో పుష్కలంగా సంపాదిస్తుండడం

చేత తనకి ఉద్యోగంచెయ్యాలసిన అవసరం, ఆసక్తి లేక పోయినవి. స్వంతంగా పాఠశాల నెలకొల్పి దేవసేవ చెయ్యాలని కోరిక కలిగింది. తన ఇంటిదగ్గరే పిల్లలను పోగుచేసుకొని, చెట్లక్రింద పాఠాలుచెబుతూ ఉండేవాడు. ఇరుగు పొరుగు పిల్లలంతా వచ్చేవారు. శాంతకూడా వచ్చేది. తను శ్రద్ధగా చదువుకోకపోయినా, నవ్వుతూ కబుర్లుచెబుతూ, పిల్లల్ని ఆడిస్తూ ఉండేది.

ఆ తరువాత, అంతా మామూలుకథే. శాంతను తను వివాహం చేసుకోవాలనుకున్నాడు. కాని, ఆమె తనకులం కాదు. అంచేత అన్నగారు ఒప్పుకోలేదు. శాంతకి ఆమె బంధువులు బలవంతంగా వేరే వివాహంచేశారు. పెళ్ళి అయిన పదినెలలకే శాంత ఒక ఆడపిల్లని కని చనిపోయింది. దాంతో తనమనసు పూర్తిగా విరిగిపోయింది. ఎందుచేతో, శాంత మరణానికి తనే కారకుడనిపించింది. తను వివాహం చేసుకుని ఉంటే, శాంత మరణించేదికాదు.

దుఃఖంతో, తను, ఎవరికీ చెప్పకుండా, దేశాంతరం వెళ్ళిపోయినాడు. తరువాత, కొన్నాళ్ళకు అన్నగారు తన ఆస్తి పంచి ఇచ్చాడు. రెండు ఏళ్ళు అమెరికాలో చదువుకొని తిరిగి వచ్చి ఇక్కడ ఉద్యోగంలో చేరాడు. అన్నగారు, తరువాత, ఎన్ని ఉత్తరాలో వ్రాశాడు: నీకు ఇష్టం వచ్చిన పిల్లనే వివాహం చేసుకోవచ్చును. అన్నీ మరచిపోయి తిరిగి రమ్మనమని. కాని, ఒక్క ఉత్తరానికీ జవాబు వ్రాయలేదు. తిరిగి వెళ్ళనూలేదు.

ఇన్నేళ్ళ తరువాత, ఆదే రూపంలో ఈపిల్ల తిరిగి తనజీవితంలో అడుగుపెట్టింది. అప్పుడు, అన్నగారిని ఎదుర్కొనే ధైర్యంలేక శాంతను పోగొట్టుకున్నాను. కాని, ప్రపంచానికి భయపడి ఇప్పుడీ పిల్లను పోగొట్టుకోగూడదనిపించింది అతనికి.

'నీకు ఎవరూ లేరన్నావుగదూ...?' అని మళ్ళా మళ్లా అడిగాడు.

'నేను పుట్టిన మూడోరోజే మా అమ్మ చనిపోయింది. ఆ తరువాత ఏడాదికే మానాన్న పోయారు. నన్ను చిన్నప్పటినుంచి మా మామయ్యే పెంచాడు. ఆయనకి చాలమంది పిల్లలు. పొలాలు సరిగా పండటంలేదు. నేను తప్పకుండా చదువుకోవాలంటే, స్కాలర్‌షిప్ వచ్చిందని ఇంతదూరం పంపారు.'

దృఢనిశ్చయానికి వచ్చినట్లు చప్పున అడిగాడు ప్రొఫెసర్ 'నిన్ను నేను పెంచుకొంటే మీ మామకి ఏమీ అభ్యంతరం ఉండదుగా?'

సుహాసిని కళ్ళువిప్పి ఆశ్చర్యంగా చూసింది.

ప్రొఫెసర్ తొందరగా మళ్ళీ అడిగాడు. 'నీ ఖర్చులన్నీ నేనేభరిస్తాను. నీకు కావలసినంత చదువు చెప్పిస్తాను' అన్నాడు, నవ్వుతో.

సుహాసిని బుగ్గలు లేతగులాబీలలాగ కందిపోయినాయి. ఏమనడానికి తెలియలేదు. ప్రొఫెసర్ కేసి తలయెత్తిచూడకుండానే అక్కడనుంచి వెళ్ళిపోబోయింది.

"వెంటనే మీ మామనొకసారి రమ్మని వ్రాయి. రైలుఖర్చులు నేను పంపుతాను" అన్నాడు ప్రొఫెసర్. ఆమెను గుమ్మందాకా సాగనంపాడు.

సరిగా వారం రోజులకి సుహాసిని మామ అక్కడ ప్రత్యక్షమయ్యాడు. ఆ వారంరోజులు ప్రొఫెసర్ ఆనందానికి అంతులేదు. వాడిపోయిన లత మళ్ళీ చిగిరించాలని ఉత్సాహపడుతుంది. ఎందుకో, ఏమో—వెఱ్ఱితనం.

ప్రొఫెసర్ ఇల్లంతా తిరిగి సర్దుకున్నాడు. సుహాసిని కోసం ప్రత్యేకం కొన్నిగదులు ఖాళీచేయించాడు. ఆమె మామవచ్చిన రోజే, తను ఒకవిందును ఏర్పాటుచేశాడు. కాలేజీకి సంబంధించినవాళ్ళనందరిని, ముఖ్యంగా నాగేశం మొదలైన విద్యార్థులని మరచిపోకుండా పిలిచాడు.

ఉన్నట్టుండి, ఇంత బ్రహ్మండంగా ప్రొఫెసర్ విందు ఎందుకిస్తున్నాడో ఎవరికీ అర్థంకాలేదు. కొందరు ఊహించుకున్నారు.

ప్రొఫెసర్ ఉత్సాహంతో, అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. తనకి జీవితంలో ఏదో శుభంకలుగుతున్నదనుకున్నాడు. నౌకర్ని గుమ్మానికి పసుపులుపూసి మామిడి తోరణాలు కట్టమన్నాడు.

ఆరోజు అందరూ సరదాగా విందు ఆరగిస్తుంటే ప్రొఫెసర్ ప్రస్ఫుటంగా చెప్పాడు: తను సుహాసినిని పెంచుకుంటున్నానని; ఆరోజునుంచి ఆమె తనకు పెంపుడుకూతురని. అందరూ ఆశ్చర్యపోయారు.

నాగేశం పెదవులపై వ్యంగ్యహాసం తొణికిసలాడింది. ప్రొఫెసర్ అది కనిపెట్టకపోలేదు. నాగేశం స్వతహాగా మంచివాడే, చాల బుద్ధిశాలికూడాను – అతనిబుద్ధి వక్ర మార్గాన్నిపట్టినా సరియైన తోవలో పెట్టేమార్గం ప్రొఫెసరికి తెలియకపోలేదు. అందుకే నాగేశం దగ్గరగావెళ్ళి, భుజం మీద చెయ్యివేసి నవ్వుతో అన్నాడు: ఏమోయ్! ఇంక నువ్వు అల్లరిగాఉంటే లాభంలేదు. చక్కగా చదివి ఫస్టున ప్యాసు అయినావంటే నిన్నే అల్లుణ్ణిగా చేసుకుంటాను.

నాగేశం ముఖంలో నవ్వు ఒక్కక్షణంలో మాయ మైంది. ప్రొఫెసర్ కేసి నిర్ఘాంతపోయి చూశాడు.

కాని, నాగేశం సుహాసిని వెనకాలే వెళ్ళడం మాత్రం మానుకోలేదు. అయితే, ఆమెను వెక్కిరించడానికి కాకుండా, ఆమెమీద ఈగ వాలకుండా కాపాడుకోడానికి మాత్రమే!

సుహాసిని కృతజ్ఞతాపూర్వ సూచకంగా నవ్వినప్పుడు ఆ చూపులలో భావాలు భారతమంత విపులంగా కట్టలు తెంచుకొని ప్రవహించేవి. ఆమెకి బదులు తనే తలవంచు కొనేవాడు.

ఒంటరిగా జీవితం సాగించిన ప్రొఫెసర్‌కి ఇన్నాళ్ళకి మరొక ప్రాణి తోడునీడైంది. సాయంత్రం సంధ్యాకాంతులలో సుహాసినితోగూడ షికారు వెళుతున్నప్పుడు ఆ ఎర్రని ఆకాశంలో ఏమూలనించో శాంత చూసి ఆనందిస్తున్నదని తోచేది ప్రొఫెసరుకి.

ఒకరోజు పరధ్యానంగా అడిగాడు సుహాసినిని మీ అమ్మపేరు ఏమిటని...'శాంత'...అన్నది సుహాసిని మెల్లగా.

సుహాసిని ముఖంకేసి తేరిపారజూసి నిట్టూర్పు విడిచాడు.

ఈపిల్లను ఇంతదూరం తనకోసం శాంతే పంపిందేమో! లేకపోతే, ఇంతదూరం ఈ పిల్ల తనకోసరం వెతుక్కుంటూ రావడమేమిటి ?

ఇంటికి వెళ్ళగానే, తనరూములో శాంత ఫోటోతీసి భద్రంగా దాచుకొన్నాడు ప్రొఫెసర్. తల్లిముఖమైనా చూచి ఎరుగని సుహాసినికి గడచిన గాథలు తెలియక్కరలేదను కున్నాడు ప్రొఫెసర్.